ఈనాడు
జోగులాంబ గద్వాల

ఇల వైభోగం.. ఆది దంపతుల కల్యాణం



కల్యాణంలో తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో జోగులాంబ ఆలయం వరకు ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి దంపతులు మంగళ వాయిదాలతో తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన విగ్రహాలను ఆలయం చుట్టూ పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి చేర్చారు. వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మ వార్ల కల్యాణం మూలా నక్షత్ర శుభ గడియలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం అమ్మవారిని సింహవాహన సేవలో భాగంగా పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

కాళరాత్రిగా జోగులాంబ: జోగులాంబ దేవి భక్తులకు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పట్టువస్త్రాలతో తిరుపతిరెడ్డి, తదితరులు



కొలువుల పండగ.. ఆనందం నిండగా!

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు నియామకపత్రాలను అందజేశారు. దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన చెన్నప్ప నియామక పత్రం అందుకుంటున్న దృశ్యమిది.

- ఈనాడు, హైదరాబాద్

సొంత రెవెన్యూనే లక్ష్యం!

- రైతులను పట్టిపీడిస్తున్న అధికారులు
- స్థిరాస్తి వ్యాపారుల కబ్జాలు, అక్రమాలకు అండ

జడ్చర్లలో భూ వ్యవహారం సీసీఎల్ఏకు వెళ్లింది. ఓ సర్వే నంబరులోని 16 ఎకరాల 32 గుంటల స్థలంలో 2 ఎకరాల 10 గుంటల భూదాన్ భూమి ఉంది. దీనికి ఓఆర్సీ ఇచ్చారని, ఇందులో జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ కోరినా సరిగ్గా స్పందించకపోవటంతో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ గత నెలలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు.

తాజాగా కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుపైనా వేటు పడింది. ధరణిలో పాసు పుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తొలగించారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇనామ్, ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీ, ఓఆర్సీలు ఇచ్చారని, డబ్బులు ఇవ్వకపోతే ఏ పనీ చేయరని ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి ఆర్డీవోను భూసంబంధ వ్యవహారంలోనే సస్పెండ్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్

కొల్లాపూర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీలార్ కొద్ది రోజుల వ్యవధిలోనే సస్పెండ్ కావటం ఉమ్మడి జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఏడాది గోపాల్‌పేట, గుండుమల్ తహసీల్దార్లు, కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలాంటి వాళ్లు ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది ఉన్నారు. పాలమూరు వ్యాప్తంగా అసైన్డు, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు నేతలు కలిసి రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఎన్‌వోసీలు తీసుకుంటున్నారు. వీరికి సాంకేతికంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొందరు రెవెన్యూ అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.



మహబూబ్‌నగర్ : ప్రజావాణిలో కలెక్టర్‌కు భూ సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

జిల్లాల్లో మచ్చుకు కొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా గతంలో పనిచేసిన ఓ ఆర్డీవో ఏకంగా 50కి పైగా ఓఆర్సీలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్సీని ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య ప్రజాప్రతినిధులు ఆ ఓఆర్సీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆర్డీవో ఓఆర్సీ ఇచ్చిన 50కి పైగా భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేశారు. అంతర్గత విచారణ సాగుతోంది.
- వనపర్తి జిల్లాలోని ఓ పురపాలికలో దేవాలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓఆర్సీ ఇచ్చారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఆ భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరులోని పలు ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్సీలు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములకు ఇష్టారాజ్యంగా ఓఆర్సీ, ఎన్‌వోసీలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజావాణిలో అన్నీ భూసమస్యలే : తమ భూ సమస్యలపై స్పందించటం లేదని, డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయటం లేదని, నెలలు, ఏళ్ల తరబడిగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చేవాళ్లల్లో 70 శాతం మంది భూ సమస్యల వాళ్లే. మండల, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇక్కడిదాకా వస్తున్నారని కలెక్టర్లు కూడా అంగీకరిస్తున్నారు. అయినా పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమవుతున్నారు. ధరణిలో మొత్తం 33 మాడ్యుల్స్ ఉన్నాయి. ఎక్కువగా పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, సర్వే నంబర్ల గల్లంతు, డిజిటల్ సంతకాలు పెండింగ్, భూ విస్తీర్ణం తక్కువగా నమోదు తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వాలి. ఇందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో మేము సైతం

పోలీసు శాఖపై యువత ఆసక్తి



శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా పోలీసు శాఖపై యువత ఆసక్తి చూపుతున్నారు. ఎస్సై ఉద్యోగానికి ఎంపికై శిక్షణ పొంది ప్రజా భద్రతకు సంసిద్ధులవుతున్నారు. వివిధ విభాగాల్లో పొందే ఈ శిక్షణ భవిష్యత్తులో విధులకు ఓ మార్గదర్శిగా ఉంటుందంటున్న జిల్లాకు వచ్చిన శిక్షణ ఎస్సైల మనోగతం ఇలా..

- న్యూస్‌టుడే, గద్వాల అర్బన్



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేశా..: మాది హన్మసానిపల్లి, నవాబ్‌పేట మండలం మహబూబ్‌నగర్ జిల్లా. బీటెక్ పూర్తి చేశాను. మాది మధ్యతరగతి కుటుంబం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి తల్లి దండ్రుల సహకారం, ప్రోత్సాహంతో పోలీసు ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. ప్రణాళిక, పట్టుదల, తపనతో కష్టపడి చదివి రాష్ట్ర స్థాయి ర్యాంకుతో విజయం సాధించాను. హైదరాబాద్ పోలీసు అకాడమీలో 2023లో ఇచ్చిన కఠోర శిక్షణ భవిష్యత్తుకు ఓ దిక్సూచిగా మారింది. ప్రస్తుతం గద్వాల గ్రామీణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నాను. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యం.

-వెంకటేశ్‌గౌడ్, గద్వాల గ్రామీణ ఠాణా



అమ్మా నాన్నల స్ఫూర్తితో..: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం మా స్వగ్రామం. బీఎస్సీ డిగ్రీ పూర్తిచేశాను. మేస్త్రీ పని చేస్తూ నా తల్లి దండ్రులు చదివించారు. వారి కష్టం చూసిన నేను మేనమామ సహకారంతో మొదటి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాను. శాంతి భద్రతలు పరిరక్షిస్తూనే నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులకు నా వంతు సహకారం అందించాలన్నది నా అభిమతం. ప్రస్తుతం శాంతినగర్ ఠాణాలో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాను...

-కుమార్, శాంతినగర్ పీఎస్



తల్లిదండ్రుల కష్టాలే దారి చూపాయి: మాది వనపర్తి జిల్లా కొత్తకోట. వ్యవసాయ కుటుంబం. నా చదువు కోసం అమ్మానాన్నలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశాను. వారి కష్టాలకు ముగింపు పలికేలా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న సంకల్పంతో సన్నద్ధమయ్యాను. ప్రణాళికతో చదివి మొదటి ర్యాంకుతో ఉద్యోగాన్ని సాధించాను. నా వంతు సహకారం అందిస్తూ శాఖకు మంచి పేరు తీసుకొస్తాను. -ఎస్.తరుణ్‌కుమార్‌రెడ్డి, అయిజ పోలీస్‌స్టేషన్



నాన్న ప్రేరణతోనే..: మాది గోపల్‌దిన్నె గ్రామం, వీపనగండ్ల మండలం వనపర్తి జిల్లా.. మధ్య తరగతి కుటుంబం.. బీఏ డిగ్రీ పూర్తి చేసిన నేను నాన్న ఇచ్చిన ప్రేరణతో పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్నాను. నాన్న మరణం కష్టాల్లోకి నెట్టింది. చాలా మంది నీకేం వస్తుంది పోలీసు ఉద్యోగం అన్నారు. వారి మాటలు పట్టించుకోకుండా ప్రయత్నించాను. ప్రజలకు సేవలందించే అవకాశం దక్కడంపై సంతోషంగా ఉంది. ప్రస్తుతం గద్వాల పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నాను. -స్వాతి, గద్వాల పట్టణ పోలీస్‌స్టేషన్

సరస్వతీ దేవిగా జములమ్మ


దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నడిగడ్డ ఇలవేల్పు జమ్మిచేడు జములమ్మ అమ్మవారు ఏడో రోజైన బుధవారం భక్తులకు సరస్వతీ దేవి అలంకారంలో ఇలా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం



స్థైర్యం వీడొద్దు.. ప్రశాంతత చెదరొద్దు!

- మానసిక ఆరోగ్యానికి ఇవే కీలకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు



మానసిక సమస్యలతో బాధపడే వారు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. ఎప్పుడూ చిన్నబోయి కనిపించటం, తనలో తానే మాట్లాడుకోవటం, పరధ్యానంలో ఉండటం, కుంగిపోవటం, చిన్నదానికి ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇవ్వన్నీ మానసిక సమస్యలే అయినా అవగాహన లేక అలా భావించటం లేదు. వైద్యం చేయించుకోవటం లేదు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

- న్యూస్‌టుడే, పాలమూరు

ఉదయం నుంచి రాత్రి వరకు తమ పనులను ప్రశాంత వాతావరణంలో చేసుకుపోయే వ్యక్తులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆలోచనలు, ఆకాంక్షలు, జీవితంపై అంచనాలు ఒకరకంగా, చేసే పనులు, వారి పరిస్థితులు మరో రకంగా ఉంటే మానసిక సంఘర్షణకు, ఒత్తిడికి గురవుతారు. తద్వారా వ్యాకులత చెంది వింతగా ప్రవర్తిస్తారు. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు కూడా ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు ఏం చేస్తున్నారో, ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుల ప్రేమ పొందలేనివారు, చదువులో వెనకబడినవారు, ఉద్యోగం రావటం లేదని బాధపడేవారు, అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఉన్నవారు మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటారు. వీరంతా మానసిక వైద్య నిపుణులను సంప్రదిస్తే నయం చేస్తారు. అవగాహన లేక ఉమ్మడి జిల్లాలో చాలా మంది భూతవైద్యులను ఆశ్రయించి జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

రోజు 150కి పైగా కేసుల రాక : మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఉండటంతో మానసిక వైద్యసేవల విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రులకు కనీసం రోజుకు 150, నెలకు 4,500 మంది వస్తున్నారు. రుగ్మత తీవ్రంగా ఉంటే వైద్యులు ఔషధాలు ఇస్తున్నారు. తీవ్రత తక్కువగా ఉండి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మానసిక రుగ్మతలు చాలా రకాలు.. : ఒకే విషయాన్ని పదే పదేగా ఆలోచించడం, దానిపైనే ధ్యాస కలిగి ఉండటం వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. మానసిక రుగ్మతలు చాలా రకాలుగా ఉన్నాయి. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, ఆత్మన్యూనత, విచిత్రంగా ప్రవర్తించడం, చేసిన పనిని పదే పదే చేస్తుండటం, అతిగా జాగ్రత్తలు తీసుకోవటం, గతంలో జరిగిన చెడు ఘటనలు తరచూ తలచుకుని బాధపడటం, మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు, గంజాయికి బానిస కావటం, తనలో తానే మాట్లాడుకోవటం, ఎవరు పిలిచినా స్పందించకుండా పిచ్చివారిలా ప్రవర్తించడం చేస్తుంటారు. ఆత్మహత్య ప్రయత్నం అనేది కూడా మానసిక రుగ్మతనే.

కుటుంబ సభ్యుల సహకారం అవసరం.. : ఉద్యోగ సాధన, ప్రేమ, వ్యాపారం ఇలా ఏదైనా విషయంలో విఫలమైనా, తీవ్ర ఒత్తిడికి లోనయినా, లైంగిక వేధింపులకు గురైనా, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడినా బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా ఇస్తే మందులు అవసరం ఉండదు. కుటుంబ సభ్యుల నుంచే ప్రేమ, ఆదరణ కరవైతే వారు ఏకాకిగా మారుతారు. తీవ్ర ఒత్తిడికి గురవుతారు. అందుకే ఏ సమస్య వచ్చినా చెప్పుకొనేలా, చర్చించేలా ప్రోత్సహించాలి.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మానసిక వైద్య నిపుణులు డా.రమాకాంత్

ఆల్కహాల్ బానిసలే ఎక్కువ.. : ఉమ్మడి జిల్లాలోని మానసిక రుగ్మతల బాధితుల్లో ఎక్కువ మంది ఆల్కహాల్ బానిసలే. ఆ తర్వాత స్థానంలో ధూమపానం, మాదక ద్రవ్యాలకు బానిసైన వాళ్లు ఉన్నారు. బాధితుల్లో 30 నుంచి 50 ఏళ్ల వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్న చిన్న వాటికి తల్లిదండ్రులు తిడుతున్నారని, కొడుతున్నారని, చదువులో రాణించలేకపోతున్నానని మానసిక ఒత్తిడికి గురవుతున్న టీనేజ్ విద్యార్థులు కూడా ఉంటున్నారు. అన్ని మానసిక సమస్యలకు పరిష్కార మార్గం ఉంది. మానిసక వైద్య నిపుణులను సంప్రదించాలి.


- డా.రమాకాంత్, మానసిక వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

తుంగభద్ర నదిలో 17,100 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో బుధవారం 17,100 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 9.5 అడుగుల ఎత్తులో ప్రవాహం దిగువకు వస్తోందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.4 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.2 అడుగులుగా ఉంది. * సుంకేసుల జలాశయం నుంచి బుధవారం మూడు గేట్ల ద్వారా 13,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 15,800 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని, కేసీ కాలువకు 2,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని జేఈ రాజు తెలిపారు.

సరిహద్దులు దాటిన దందా

గుట్కా, మట్కా, జూదంతో చిత్తవుతున్న జీవితాలు



సరిహద్దులో కర్ణాటక చెక్‌పోస్ట్ ఇలా..

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

అలవాటు వ్యసనంగా మారితే ఇక అంతే సంగతులు. ఫలితంగా అప్పులు.. అనారోగ్యాలు.. ఆత్మహత్యలు.. హత్యలకు దారితీస్తున్న ఉదాహరణలు ఎన్నో. కుతూహలంతో మొదలెట్టి చెడు అలవాట్లుగా మారి చివరికి వాటికి బానిసలైన వారు కుటుంబాలనే దివాళా తీయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో అడ్డదారుల గుండా గుట్కా, గంజాయి, నల్లబెల్లం, పొగాకు ఉత్పత్తులు ప్రవేశిస్తున్నాయి. గద్వాల, నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు ఇవి చేరుతున్నాయి. రెబన్‌పల్లి, కాన్‌కుర్తి, సజనాపూర్, వాసునగర్, నందిన్నె చెక్‌పోస్టులను దాటుకుని వస్తున్నా అడిగేవారే లేరు.

నిషేధం ఉన్నా... : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెల నుంచి గుట్కాను నిషేధిత జాబితాలో చేర్చినా ఇప్పటికీ వ్యాపారం గుట్టుగా సాగుతోంది. కర్ణాటకలో గుట్కా, పొగాకు ఉత్పత్తులపై నియంత్రణ లేకపోవడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాయచూరు నుంచి వస్తున్న సరకు తెలంగాణ మీదుగా ఏపీకి వెళ్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మక్తల్ పట్టణంలోని సంతబజారులో గుట్కా వ్యాపారి పోలీసులు వచ్చినా ఏం కాదనే ధోరణితో వ్యవహరిస్తున్నారని, అలాంటప్పుడు ఫిర్యాదు చేసి ఉపయోగం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పల్లెలకు పాకిన మట్కా : ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు పెద్ద పట్టణాలకే పరిమిత మైన ఈ క్రీడ పల్లెలకూ పాకడంవిస్తుగొలుపుతోంది. ఏజెంట్లుగా మారిన చాలా మంది యువకులు చరవాణులలో ప్రత్యేక యాప్‌ల ద్వారా ఈ నెంబర్ గేమ్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించారు. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే రోజూ వందల మంది కొత్తగా ఇందులోకి దిగుతున్నారు.

ఒకప్పుడు ఈ వ్యసన క్రీడను ప్రత్యక్షంగా వెళ్లి ఆడేవారు. అంతా చరవాణిలోనే సాగిస్తున్నారు. మక్తల్ మెయిన్ రోడ్డులో ఓ వ్యక్తి నెలకు రూ.10వేల కిరాయి చెల్లిస్తూ తన దుకాణాన్ని అడ్డాగా మార్చుకొని మట్కాను ప్రోత్సహిస్తున్నారు. నారాయణపేట శివారు కాలనీలో ఒకరు మూడు ఇళ్ల అద్దెకు తీసుకొని పేకాట, మట్కా దందా నడిపిస్తున్నారు.

విస్తరిస్తున్న జూద కేంద్రాలు : పేకాట జూదానికి వేలాది కుటుంబాలు బలైపోతున్నాయి. రాయచూరు క్లబ్‌లలో 24గంటలు ఈ క్రీడకు అనుమతి ఉన్నందున ఈ ప్రాంతం నుంచి మరీ రాయచూరు వెళ్లి దివాళాతీసే వారు ఎందరో కనిపిస్తారు. జిల్లా నుంచి కిరాయి వాహనాలు నేరుగా పేకాట క్లబ్‌ల వద్దకే నడిపిస్తున్నారు.

- మక్తల్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సొంత వాహనంలో మనుషలను తీసుకెళ్లి హైదరాబాద్, షాద్‌నగర్‌లలో ఆడించేవాడు. ఆ తర్వాత రాయచూరుకు మార్చారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పేకాట, మట్కాలకు బానిసై తనకు ఉన్న ఏడెకరాల భూమిని అమ్ముకున్నారు. ఓ వెలుగువెలిగిన వ్యాపారవేత్త పేకాటకు రాయచూరు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు.
- నారాయణపేటలో పేరున్న వ్యాపారి పేకాటతో దివాళా తీసి చివరకు సొంత ఇంటిని తాకట్టుపెట్టారు.
- ఊట్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన జోడెద్దులు అమ్మి వచ్చిన రూ.1.2 లక్షలను జూదం ఆడి పోగొట్టుకున్నారు. కుటుంబ సభ్యులు మందలించగా ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఏం చేయాలి? : కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. కూరగాయల మాటున మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకోవాలి. ఏళ్లకు ఏళ్లు పాతుకుపోయిన చెక్‌పోస్టు ఉద్యోగులను తరచూ బదిలీ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి.

కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాల అందజేత

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖాధికారి రవీందర్ బుధవారం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో నూతన కొలువులకు ఎంపికైన కొందరు ఉపాధ్యాయులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయగా, జోగులాంబ గద్వాలకు కేటాయించిన ప్రత్యేక కౌంటర్‌లో జిల్లాకు చెందిన నూతన ఉపాధ్యాయులకు డీఈవో నియామక పత్రాలు అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు అధికారులు పాల్గొన్నారు.



ఎస్జీటీలో మొదటి ర్యాంకు సాధించిన శ్రుతికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

పునర్విచారణ చేయాలంటూ ఫిర్యాదు: టీజీ డీఎస్సీలో ఎంపికైన కొందరి హిందీ పండిత్‌ల ధ్రువపత్రాలను పునర్విచారణ చేయాలని కోరుతూ 1:3 నిష్పత్తిలో ఎంపికైన బాధిత అభ్యర్థులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉద్యోగం పొందిన కొందరి విద్యా ధ్రువపత్రాలపై తమకు అనుమానం ఉందని, ఈ విషయమై ఇది వరకే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి: ఎమ్మార్పీఎస్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని, అవసరమైతే అందుకు ఆర్డినెన్స్‌ను తీసుకుని వస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదని ఎమార్పీఎస్ నాయకులు ఆరోపించారు. వర్గీకరణ చేపట్టకపోవడంతో ఉద్యోగాలకు అర్హులైన చాలా మంది అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణను చేపట్టాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ చౌరస్తా నుంచి ఐడీవోసీ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఏవో వీరభద్రప్పకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, బీమన్న, ఏసన్న, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఎమార్పీఎస్ నాయకులు

అసలే పేదరికం.. ఆపై క్యాన్సర్ భూతం


తల్లిదండ్రులతో అనిల్

మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన కళప్ప గొర్రెల కాపరిగా, అతని భార్య పద్మమ్మ రోజుకూలీగా కష్టపడుతూ ఇద్దరు పిల్లలనూ చదివిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలోకి క్యాన్సర్ భూతం అడుగుపెట్టింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు అనిల్‌ను కబళించింది. ఇన్నిరోజులూ పోగేసిన డబ్బంతా రక్త క్యాన్సర్ చికిత్సకు నీళ్లలా ఖర్చు చేయాల్సి వచ్చింది. గొర్రెలు విక్రయించి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో కిమోథెరపీ చేయించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చయినా జబ్బు పూర్తిగా నయం కాలేదు. మరో రూ.10లక్షలు ఖర్చుచేస్తే తప్ప బాబు కోలుకోలేడని వైద్యులు చెప్పారు. అంత స్థోమత లేక హైదరాబాద్ నుంచి స్వ గ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరఫున తిరుపతిరెడ్డి దంపతులు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు కుమార్తె పదోతరగతి వరకు ఉచిత విద్యను అందించడానికి ముందుకు వచ్చారు. దాతలు సహృదయంతో స్పందిస్తే 18ఏళ్ల యువకుడికి నిండు నూరేళ్ల జీవితం ఇచ్చినట్లు అవుతుంది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే


రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి

ధరూరు, న్యూస్‌టుడే : మిర్జాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్యురెడ్డి రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కారణంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబరులో మైసూరులో 11 ఏళ్లలోపు విభాగం రోలర్‌స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి భిన్నమైన క్రీడను ఎంపిక చేసుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావటంపై గ్రామస్థులు అభినందించారు.



బంగారు పతకంతో రితిక్ అభిమన్యురెడ్డి (మధ్యలో)

వరి కంకులను తలపిస్తున్న మంచు బిందువులు




మంచు కురిసె.. కంకుల్లా మెరిసె!


వరి పైరుపై మెరుస్తున్న మంచు బిందువులు

వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. తెల్లవారు జామున మంచు కురుస్తోంది. మంచు కరిగి వరి పైరు కొనలపై నీటి బిందువులు సూర్య కిరణాలకు మెరుస్తూ కంకులను తలపిస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతంలో ఈ చిత్రాలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి. - **న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం**

గుండె నిండా బడిగంటలు



బావ, బావమరుదులు ఒకేసారి


మోహన్‌నాయక్


తుల్యానాయక్

ధన్వాడ, న్యూస్‌టుడే : ముడుగుల మల్లయ్యతండాకు చెందిన మోహన్‌నాయక్ ధన్వాడ మండలంలోని మందిపల్లి కొత్త తండాకు చెందిన తుల్యానాయక్ అక్కను వివాహమాడారు. మోహన్ నాయక్, తుల్యానాయక్ ఇద్దరూ డీఎస్సీకి ఎంపికై ఎస్జీటీలుగా నియమితులయ్యారు. ఒకే సారి బావ బామ్మర్దులకు కొలువులు రావడంపై రెండు కుటుంబాలతో పాటు ఆయా తండాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది

రెండు నెలల్లో రెండు..


జి.గోవర్ధన్

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌కు వరుసగా రెండు కొలువులు దక్కాయి. రెండు నెలల క్రితం ఈయనకు బీసీ గురుకులంలో ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చింది. ఇందులో ప్రవేశం పొందిన ఈయనకు ఇపుడు స్కూల్ అసిస్టెంట్(గణితం) ఉద్యోగం వచ్చింది. జిల్లాస్థాయిలో గణితంలో మూడో ర్యాంకు సాధించిన ఈయన గురుకులం ఉద్యోగం వదిలి స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన ఉద్యోగాలు రాక ముందు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వ్యవసాయంలో తండ్రికి సహాయపడుతూ వచ్చాడు. గణితమంటే చాలా ఇష్టమని, అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా అవకాశం రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

అన్నదమ్ములు సాధించారు


నియామక పత్రాలతో సోదరులు వెంకటేశ్, శ్రీనివాస్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న అన్నదమ్ముల లక్ష్యం నెరవేరగా.. అందులో ఒకరు మూడు కొలువులు సాధించి ఔరా అనిపించారు. కోస్గి మండలం పీసీ తండాకు చెందిన ఎస్.నార్యానాయక్, కిష్టమ్మ దంపతుల కుమారులు ఎస్.వెంకటేశ్, ఎస్.శ్రీనివాస్‌నాయక్‌లు 2024 డీఎస్సీలో సత్తాచాటి ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఎస్జీటీ జనరల్ కేటగిరీలో తమ్ముడు ఎస్.శ్రీనివాస్ నాయక్ 19వ ర్యాంకు, అన్న ఎస్.వెంకటేశ్‌కు 11వ ర్యాంకు వచ్చింది. ఎస్.శ్రీనివాస్ ప్రస్తుతం విశాఖపట్నంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా ఇటీవల గ్రూప్-4 పోటీపరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగం సాధించారు. ఎస్జీటీలో కొనసాగుతామని వారు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరు ఒకేసారి ఉపాధ్యాయులుగా నియమితులు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

ఒకే తండాలో ముగ్గురికి..


మీనాక్షి తరుణ్ జగన్నాథ్

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధి పెద్దతండాకు చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదివి సత్తా చాటారు. జిల్లాలో ఎస్టీ విభాగంలో 12 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఒకే పెద్దతండాకు చెందిన మీనాక్షి, తరుణ్, జగన్నాథ్ ఎంపిక కావడం విశేషం. మీనాక్షి, జగన్నాథ్‌లు గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి విఫలమైనా అధైర్యపడకుండా ఎస్జీటీలో సత్తాచాటారు.

మూడు ఉద్యోగాలతో జయకేతనం


తల్లిదండ్రులతో రాజేశ్వరి ఎడమ నుంచి రెండో వ్యక్తి

ఊట్కూరు, న్యూస్‌టుడే : నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన జయశ్రీ, కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలో చిన్న టిఫిన్ సెంటరు నడుపుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కష్టపడి చదివి 2017 డీఎస్సీకి హాజరయ్యారు. 0.6 మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రుల కష్టం మనసులో ఉంచుకుని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఆంగ్లం, సాంఘికశాస్త్రం ఉద్యోగాలు సాధించారు. మూడు నెలల క్రితం మక్తల్ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం ఎస్జీటీగా అవకాశం వచ్చినా తరువాత ర్యాంకు వారికి అవకాశం వస్తుందనే భావనతో వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ ఉద్యోగం సాధించటమే లక్ష్యమని చెబుతున్నారు.

ఔరా! ఐదు కొలువులు


వెంకట్రామి రెడ్డి, గుండుమాల్

కోస్గి, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... ఐదుకు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే మాటలా? కాని చేసి చూపించారు గుండుమాల్‌కు చెందిన బాలుజారి వెంకట్రామిరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి, తల్లి యశోద వ్యవసాయం చేసుకుంటూ ఆయనను చదివించారు. 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, చేయడం ఇష్టం లేక వెళ్లలేదు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2017లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భిక్షమల్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో సాంఘికశాస్త్రంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, తెలుగులో ఎనిమిదో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు.. మరో పరీక్షలో రాష్ట్రస్థాయి 164వ ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమాధికారిగా ఎంపికయ్యారు. . తాను ఉపాధ్యాయుడిగానే కొనసాగి పేద విద్యార్థులకు సహాయపడతానని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

యాబైలో పడినా..


అశ్విని నర్సిములు

ధన్వాడ : ధన్వాడ పట్టణానికి చెందిన అశ్విని నర్సిములు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన తెలుగు పండిట్ కోర్సు చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే, ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ, కులవృత్తి చేస్తూ ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వయసు 50లో పడినా ఇదే చివరి అవకాశం కావడంతో అహర్నిశలు కష్టపడ్డారు.

సహకారంతో గెలిచారు..


చెన్నప్ప, సజనాపూర్

దామరగిద్ద : సజనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, హన్మంతు దంపతులకు అయిదు గురు సంతానంలో మూడోవారు చెన్నప్ప. ఈ కుటుంబం వ్యవసాయం, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని స్థితిలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెన్నప్ప చదువును కొనసాగించారు. ఇటీవల డీఎస్సీలో జిల్లాలో 13వ ర్యాంకుతో ఉపాధ్యాయ నియామక పత్రాన్ని సీఎం చేతులమీదుగా అందుకున్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెన్నప్ప చెప్పారు.

భర్త ప్రోత్సాహంతో మూడు..


మమత

వనపర్తి పట్టణం : కొత్తకోటకి చెందిన మమత మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త రాఘవరెడ్డి ప్రోత్సాహంతో వీటిని సాధించానని ఆమె తెలిపారు. టీజీటీ గణితం ఉద్యోగానికి ఎంపికై వెల్టూరు బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియాయక పత్రం అందుకున్నారు. హాస్టల్ వార్డెన్‌గా ఎంపికైనప్పటికీ ధ్రువపత్రాల పరిశీలన కాలేదు.

ఊట్కూరు.. ఆరుగురు


కె.అశోక్, మాలతి లత

ఊట్కూరు : ఊట్కూరు నుంచి ఏకంగా ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సర్దార్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.ప్రదీప్ తెలుగు పండింట్‌గా, శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కె.అశోక్ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా నియామకపత్రాలు అందుకున్నారు. మాలతి లత జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా, కార్గిల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు మహేశ్, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన భారతి ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు. టి.మోనప్ప(పాతపేట) హిందీ పండిట్‌గా ఎంపికయ్యారు. వీరంతా ఊట్కూరు పేరును మార్మోగించారు.

పీజీ వైద్య సీట్లకు కసరత్తు

ఎముకలు, ఈఎన్‌టీ, మత్తుమందు, నేత్ర విభాగాల్లో దరఖాస్తు


పీజీ సీట్లపై చర్చిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, సహాయ ఆచార్యులు డా.కిరణ్‌ప్రకాశ్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీజీ సీట్ల కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2016లో కళాశాల ప్రారంభమైంది. ఐదేళ్ల తర్వాత నుంచి పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నుంచి దరఖాస్తు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చినా ఆయా వైద్య విభాగాలకు తగినంత ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేకపోవడంతోనే సీట్లు మంజూరు కావటం లేదు. కొత్తగా దరఖాస్తు చేస్తున్న వైద్య విభాగాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రస్తుతం ఉన్నవి 29 మాత్రమే : మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. క్లినికల్‌లో ప్రసూతి విభాగానికి రెండేళ్ల క్రితం అనుమతి రాగా ఆరు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది పిడియాట్రిక్(చిన్నపిల్లలు), ఆప్తమాలజీ(కన్ను), అనస్థీషియా(మత్తుమందు) తదితర విభాగాల్లో పీజీ సీట్లకు దరఖాస్తు చేయగా ఎన్ఎంసీ పిడియాట్రిక్‌కే అనుమతి ఇచ్చింది. ఈ విభాగంలో మంజూరయ్యే నాలుగు పీజీ సీట్లల్లో వచ్చే నెలలో వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. తగినంత మంది ఆచార్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆప్తమాలజీ, అనస్థీషియా విభాగాలకు అనుమతి రాలేదు. నెల క్రితం జరిగిన బదిలీల్లో కళాశాలకు అనస్థీషియా, ఆప్తమాలజీ ఆచార్యులు రావటంతో ఆయా విభాగాల్లో పీజీ సీట్ల కోసం మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వీటికి కూడా అనుమతి లభిస్తే అదనంగా నాలుగు చొప్పున 8 పీజీ సీట్లు మంజూరవుతాయి. 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), ఈఎన్‌టీ (గొంతు, ముక్కు, చెవి) కోర్సుల్లో నాలుగు చొప్పున సీట్ల కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయడానికి కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫీజుగా ఒక్కో విభాగానికి రూ.5.90 లక్షల చొప్పున మొత్తం రూ.11.80 లక్షలు ఎన్ఎంసీకి చెల్లిస్తున్నారు. సిబ్బంది కూడా ఉండటంతో వీటికి పీజీ సీట్లు వస్తాయని నమ్ముతున్నారు.

ముఖ్య విభాగాలకే మొండిచేయి.. : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా రోగులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్య సేవల కోసమే వస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో పీజీ సీట్లు చాలా అవసరం. జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు రావడానికి ఒక ఆచార్యుడు, ఏడుగురు అసోసియేట్ ఆచార్యులు, 15 మంది సహాయ ఆచార్యులు, 220 పడకలు, ఏడు యూనిట్లు ఉండాలి. పడకలు, యూనిట్లు ఉన్నా.. ఒక ఆచార్యురాలు, నలుగురు అసోసియేట్ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు మాత్రమే ఉండటంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడం లేదు. జనరల్ సర్జరీ విభాగంలో ఆచార్య పోస్టు ఖాళీగా ఉంది. ఒక అసోసియేట్ ఆచార్యుడు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉన్నారు. ఫలితంగా పీజీ సీట్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ట్రాలీ ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరి మృతి

పెబ్బేరు పట్టణం, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి పెళ్లి సంబంధం కుదుర్చుకుని వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి, స్వల్ప గాయాలైన వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో బోయ ముద్దు చిన్నరాముడు(60), బోయ మునెన్న(70) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో చెనుగోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.


క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

ఆదర్శ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం/ రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శక్తికి ప్రతిరూపం మహిళ అని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసంలో వారంరోజుల పాటు ప్రారంభిక శిక్షా వర్గను నిర్వహించి చివరిరోజు బుధవారం పట్టణంలో పథసంచలనం నిర్వహించారు. మాడల్ బేసిక్ పాఠశాల నుంచి ర్యాలీగా ప్రారంభమై బాలగంగాధర్‌తిలక్ చౌరస్తా, గడియారం, మార్కెట్ రోడ్, పాతబస్టాండ్, పాన్‌చౌరస్తా, రాంమందిర్‌చౌరస్తా, రాంనగర్, వన్ టౌన్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ముఖ్య వక్తగా ఉమాదేవి మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళా అని అభివర్ణించారు. తమ కుటుంబాన్ని ఏవిధంగా సక్కదిద్దుకుంటుందో ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కూడా ప్రతి మహిళ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షురాలు డా.కె.పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయిలా మనోధైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వయం సేవికా సమితి విభాగ్ కార్యావాహిక దేదీప్యశ్రీ, పాలమూరు జిల్లా కార్యావాహిక నాగిళ్ల అరుణ, రాష్ట్ర స్వయం సేవికలు లక్ష్మీ, వసంతం పద్మావతి, ఉమా, సులోచన, రాజేశ్వరితో పాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర సేవికా సమితి కార్యకర్తల పథసంచలనం


మాట్లాడుతున్న ఉమాదేవి

కృష్ణా తీరంలో సఫారీ

కొల్లాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో విహరించడానికి సఫారీ వాహనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహనంలో ఒకేసారి 8 మంది ప్రయాణించవచ్చని, ఒకరికి రూ.200 టికెట్‌గా నిర్ధారించినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమశిల తీరంలోని పుష్కరఘాట్ల దగ్గర, కొల్లాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్కు వద్ద సఫారీ వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. సోమశిల ఏకో పార్కు, అటవీప్రాంతం లోపల వాచ్ టవర్, ఎర్రకుంట తీరప్రాంతం అందాలు చూపించి తర్వాత యథాస్థానంలో దింపుతారు.

- **న్యూస్‌టుడే, కొల్లాపూర్**


సోమశిల అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్దకు సఫారీ వాహనంలో వచ్చిన పర్యాటకులు

వివాహిత అనుమానాస్పద మృతి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బావిలో పడి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. గోపాల్‌పేట మండల ధర్మతండాకు చెందిన శాంతమ్మ (40) మంగళవారం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆమె కుమార్తె వసంత సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఎక్కడున్నావని.. ఎప్పుడు వస్తావని అడిగారు. ఎనుకుంట వద్ద ఉన్నానని త్వరలో ఇంటికి వస్తానని శాంతమ్మ బదులిచ్చారు. ఆమె ఫోన్ 7.30 గంటలకు స్విచ్ఛాఫ్ అయ్యింది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి స్టార్టర్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టార్టరు కోసం వెతుకుతుండగా బావి గడ్డపై చెప్పులు, చున్నీ, బావిలో చీర ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి శాంతమ్మ భర్త బద్రు, కుమారుడు గణేశ్, కుమార్తె వచ్చి చీర, చెప్పులను చూసి గుర్తు పట్టారు. ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్సై జలేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ బృందం వెంట వచ్చిన శునకం చెన్నూరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఆగింది. వివాహిత మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బావిలో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బి.ప్రభాకర్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించిందని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


శాంతమ్మ

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్.. **దేవర, సత్యం సుందరం, శ్వాగ్,** **అయిజ:** శివసాయి: **దేవర,** భువనేశ్వర్: **బహిర్భూమి, యమకంత్రి,** మాధవ్ : **వేట్టయన్**

–న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు



దర్శనానికి వస్తున్న న్యాయమూర్తి దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దర్శించుకున్నారు. వేర్వేరు సమయాల్లో వచ్చిన వారికి ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయాల విశిష్టత వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

ఘనంగా తిమ్మప్పస్వామి ఉత్సవాలు

అయిజ, న్యూస్‌టుడే: అయిజ పట్టణంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. వాహనాన్ని లాగేందుకు భక్తులు తరలివచ్చారు. విద్యుత్తు దీపాలు, కాగడాల వెలుతురులో నిర్వహించిన ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం స్వామివారి విగ్రహానికి అభిషేకం, వస్త్రాలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి, ప్రసాద వితరణ తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం పూజలు నిర్వహించారు.



గజవాహనంపై తిమ్మప్పస్వామి

ఘనంగా మూల నక్షత్ర దీపోత్సవం

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ ఆది శిలాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మూలా నక్షత్రదీపోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గోపూజ, హోమం, పంచామృతాభిషేకం, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. అనంతపద్మనాభ ఆలయంలో దీపాలను వేదోక్తంగా అర్చకులు వెలిగించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఆస్రా జిల్లా అధ్యక్షుడిగా భరత్

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ఆస్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) కమిటీ జిల్లా అధ్యక్షునిగా భరత్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గద్వాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆస్రా వ్యవస్థాపకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ పర్యవేక్షణలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌గుప్త ఆధ్వర్యాన నూతన కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఉపాధ్యక్షునిగా జగదీశ్, కార్యదర్శిగా రవి, ఉప కార్యదర్శిగా మహేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఈశ్వర్ ఎంపికయ్యారు. ఆస్రా నేషనల్ లీగల్ కమిటీ మెంబర్ శివకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



భరత్‌కు నియామకపత్రం అందజేస్తున్న హబీబ్ సుల్తాన్‌అలీ

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

ధరూరు: మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎంపిక బుధవారం ధరూరులో జరిగింది. సంఘం అధ్యక్షులుగా మీర్జా హుస్సేన్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా వసంతకుమార్, కోశాధికారిగా గురునాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హుస్సేన్‌బేగ్ అన్నారు. సమావేశంలో ధరూరు మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: పెబ్బేరు సమీపంలో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడి గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన పలువురు బాధితులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలు బాధిత బంధువుల ద్వారా తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.

మహిళ మృతి: కేసు నమోదు

మల్దకల్, న్యూస్‌టుడే: సద్దలోనిపల్లెకు చెందిన సుజాతకు(22) అనారోగ్యం, తీవ్ర జ్వరంతో గద్వాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా బుధవారం ఉదయం మృతిచెందినట్లు ఎస్సై నందికర్ తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి పెద్దనర్సింహులు, జయలక్ష్మి మూడో కూతురు సుజాతను సద్దలోనిపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. కొన్ని రోజుల నుంచి ఆమె అనారోగ్యం, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా మంగళవారం రాత్రి చికిత్సకు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

రాజోలి, న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం నిర్వహించిన తనిఖీల్లో రెండు టిప్పర్ల పట్టుకొని కేసు నమోదు చేసినట్లుగా హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు. రాజోలి గ్రామం నుంచి ఇసుక అక్రమంగా తరలుతోందన్న సమాచారంతో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించగా, అశోక్‌నగర్ వద్ద ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను గుర్తించారు. అలాగే రాజోలిలో ఒక ఖాళీ టిప్పరును గుర్తించి ఠాణాకు తరలించారు.

తాగునీటి మోటార్ స్టార్టర్ చోరీ

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పూడూరులో బుధవారం గ్రామానికి తాగునీటిని అందించే విద్యుత్తు మోటార్ స్టార్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు ఆరోపించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడగా తాత్కాలికంగా ఏర్పాటుచేసి నీటిని సరఫరా చేశారు. వారం రోజుల పూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంపల్లిలో కూడా స్టార్టర్ ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. సీసీ కెమెరాల కోసం రూ.3 లక్షలు చందాల రూపంలో సేకరించినా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రతిభ చాటి.. జాతీయ స్థాయిలో మెరిసి!

'ప్రేరణ' సదస్సుకు ఇద్దరు నడిగడ్డ విద్యార్థులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, దేశం కోసం ఏమి చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రేరణ' కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ప్రత్యేక సదస్సులో ఈ ఇద్దరు విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లు పాల్గొననున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమానికి జిల్లా నుంచి ఒక్కరు కూడా ఎంపిక కాలేదు. మొదటిసారి 35వ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికవగా, ఆ ఇద్దరూ జోగులాంబ జిల్లా విద్యార్థులే కావడం విశేషం. వీరితో పాటు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, రాజస్థాన్, అసోం, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థులకు అవకాశం లభించింది.

ఎంపిక జరిగిందిలా..

ప్రేరణ కార్యక్రమానికి సంబంధించి గడిచిన ఏప్రిల్ మాసంలో అన్ని పాఠశాలల నుంచి ప్రతిభ ఉన్న ఇద్దరు విద్యార్థుల చొప్పున వట్టెం నవోదయకు 70 మందిని పంపారు. అక్కడ ప్రత్యేక కమిటీ వారు వికసిత్ భారత్ వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన 30 మందికి ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేశారు.

వీటిపైనే ప్రధాన శిక్షణ

నవంబరు 24 నుంచి 30 వరకు గుజరాత్ రాష్ట్రంలోని వాద్రాపూర్‌లోని పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులుంటాయి. ముఖ్యంగా తొమ్మిది అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు. స్వాభిమాన్, ధైర్య సాహసాలు, పరిశ్రమలు, కరుణ/సేవ, భిన్నత్వంలో ఏకత్వం, సత్య నిష్ఠ, నిజాయితీ - నాయకత్వం, సాంకేతికత, విశ్వసనీయత, స్వేచ్ఛ - కర్తవ్యం, సత్యం, అహింస, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, చారిత్రక విశేషాలు నేర్చుకోనున్నారు. సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా చైతన్యం తీసుకొచ్చేలా శిక్షణ పొందనున్నారు.

గద్వాల పట్టణం నుంచి



గద్వాల పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కాత్యాయని వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటి జాతీయ సదస్సుకు ఎంపికైంది. ఈ బాలికతో పాటు గైడ్ టీచర్ షబీనాబేగం సదస్సులో పాల్గొంటారు. ఎంపిక పట్ల తల్లిదండ్రులు లక్ష్మీనర్సింహరాజు, శ్రీలత, కరస్పాండెంట్ సవారన్న హర్షం వ్యక్తం చేశారు. దేశ సేవ, అభివృద్ధి, నీతి నిజాయతీల గురించి తెలుసుకుంటానని, తోటి విద్యార్థులకు వాటి విలువలను వివరించడంతో పాటు, జీవితంలో అవలంబిస్తానని కాత్యాయని తెలిపింది.

వ్యవసాయ కూలీల బిడ్డ



అయిజ మండలం ఉప్పల గ్రామంలో వ్యవసాయ కూలీలుగా జీవనం గడిపే వీరేశ్, గోవిందమ్మ దంపతుల కుమారుడు ఆదికేశవ వసతిగృహంలో ఉంటూ గద్వాల పట్టణంలోని చింతలపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వికసిత్ భారత్ ఉపన్యాస పోటీలో ప్రతిభ చాటడంతో ప్రేరణ జాతీయ కార్యక్రమానికి ఎంపికయ్యాడు. దీనిపై ఆనందంగా ఉందని, సదస్సులో వారు చెప్పినవి నేర్చుకుంటానని ఆదికేశవ అంటున్నాడు.

బాల్య వివాహాలు వద్దు



చింతరేవులలో అవగాహన కార్యక్రమం

ధరూరు, ఉండవల్లి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు బాలికలకు వివాహాలు చేయాలని చూస్తే నేరుగా అధికారులకు తెలియజేయాలని ఉప్పేరు ఆరోగ్య కేంద్రం వైద్యుడు రవికుమార్ సూచించారు. బుధవారం చింతరేవుల గ్రామంలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, సత్యార్థి చిల్డ్రన్ సొసైటీల అధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికలు చరవాణుల వాడకం తగ్గించి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని పేర్కొన్నారు. ● ఉండవల్లి మండలం బొంకూరులో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, రోడ్డు భద్రత నిబంధనలు, మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో కలిగే నష్టాలు, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి, బడిఈడు పిల్లలకు చదువు ప్రాముఖ్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సభ్యులు కేశవులు, కవిత, భూపతినాయుడు, డప్పు కృష్ణ వీటిపై ప్రజలకు వివరించారు.

బస్సుల్లో వెళ్లి.. నియామకపత్రం అందుకొని..

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకోవడానికి ఐడీవోసీ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బస్సులను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ ద్వారా జిల్లాలో ఎంపికైన 172 మంది ఉపాధ్యాయ అభ్యర్థుల్లో 141 మంది బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పత్రాలు అందుకోనున్నారని తెలిపారు. ప్రయాణ సమయంలో భోజన వసతి, తాగునీరు వంటివి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో సరస్వతిదేవిగా..



ఉండవల్లి మండలం ప్రాగటూరులో..



గద్వాల వాసవీ మాత ఆలయంలో కుంకుమార్చన..



ధరూరు కాళికాలయంలో అలంకారం..



గద్వాల వీరభద్రస్వామి దేవాలయంలో..

చదువుల తల్లిగా దుర్గామాత

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు. ఈ నేపథ్యంలో పలు దేవాలయాల్లో భవానీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు బతుకమ్మ ఆడారు. సాయంత్రం కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. –న్యూస్‌టుడే బృందం



చెన్నిపాడు గ్రామంలో బతుకమ్మలతో మహిళలు, యువతులు



అయిజ కన్యకాపరమేశ్వరి ఆలయంలో తులాభారం



అలంపూర్ మండలం బుక్కాపురంలో..



బీచుపల్లిలోని కోదండరామాలయంలో అక్షరాభ్యాసం



మల్దకల్ బిజ్వారంలో బతుకమ్మ వేడుకలు

స్నేహపూర్వక పోలీసింగ్ బలోపేతం

జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ పిలుపు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: పోలీసు శాఖపై పూర్తి స్థాయిలో విశ్వాసం కలిగేలా స్నేహపూర్వక పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పోలీసు అధికారులను ఆదేశించారు. గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయాన్ని, డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం డీఐజీ తనిఖీ చేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి డీఐజీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలు డీఎస్పీ సత్యనారాయణ ద్వారా తెలుసుకున్నారు. ● అలంపూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను తరచూ తనిఖీ చేయాలని డీఐజీ, సీఐ రవిబాబుకు సూచించారు. అలంపూర్ సీఐ కార్యాలయంతో పాటు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీతో కలిసి మొక్కలు నాటారు. డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● అలంపూర్ నవబ్రహ్మ ఆలయాలను, జోగులాంబ అమ్మవారిని చౌహాన్ దర్శించుకున్నారు.



ఇటిక్యాల పోలీసు సిబ్బందితో డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



అదనపు కలెక్టరు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అయిజ, న్యూస్‌టుడే: టీటీదొడ్డి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా అదనపు కలెక్టరు లక్ష్మీనారాయణకు బుధవారం గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి గద్వాలలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని అదనపు కలెక్టరుతో మాట్లాడారు. పాఠశాలలో 180 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయుల మాత్రమే ఉన్నారని వివరించారు. ఎద్దుల రాముడు, పంపాపతి పాటిల్, రావప్పగౌడ్, మునిస్వామి, రామప్ప, హనుమంతు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులు సరిచేయాలని వినతి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పని చేసిన ముగ్గురు కలెక్టర్లతో మొరపెట్టుకున్నా సమస్య తీరకపోవడంతో గత మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ధరణి వల్ల తనకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఛైర్మన్ చిన్నారెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కేటీ దొడ్డి మండలం కుచ్చినెర్ల గ్రామానికి చెందిన సామిత్రమ్మ కుటుంబం ప్రస్తుతం కర్ణాటకలోని రాయిచూర్‌లో నివాసం ఉంటోంది. వీరు 2012లో గ్రామానికి చెందిన కుర్వ దేవేంద్రప్ప నుంచి 5 ఎకరాలు కొనుగోలు చేశారు. భూమి 2019 వరకు సామిత్రమ్మ పేరు మీదనే ఉంది. ధరణిలో సైతం సామిత్రమ్మ పేరు మీదనే నమోదై ఉంది. 2020లో కేటీ దొడ్డి తహసీల్దార్ సామిత్రమ్మ పేరును తొలగించారు. ఎవరి పేర్లనో చేర్చారు. అప్పటి నుంచి ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తు చేసుకోగా సర్వేకు ఆదేశించారని, మండల సర్వేయర్ సర్వే చేసి నివేదిక ఇచ్చినా అక్రమంగా చేర్చిన పేర్లను తొలగించి సామిత్రమ్మ పేరును రికార్డులో నమోదు చేయడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పన్ను కట్టకపోతే చట్టపర చర్యలు

ఉండవల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తులను వాహనాల్లో తరలించే ప్రతిఒక్కరూ మార్కెట్‌యార్డు పన్ను తప్పక చెల్లించాలని, అలా చేయకపోతే చట్టపరమైన చర్యలుంటాయని అలంపూర్‌చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శి యల్లస్వామి అన్నారు. బుధవారం మండలపరిధి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మార్కెట్‌యార్డు అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పన్ను కట్టకుండా వ్యవసాయ ఉత్పత్తులు తరలిస్తున్న 10 వాహనాలకు రూ.68 వేలు వసూలు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



గద్వాల పుర పరిధిలోని 16వ వార్డు భీంనగర్‌లో ఆదిత్య ఆస్పత్రి సమీపంలో మురుగు కాలువ స్లాబ్ ప్రమాదకరంగా ఉంది. చాలా రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి కిందపడిన సంఘటనలు ఉన్నాయి. రాత్రి సమయంలో పాదచారులు సైతం ఇందులో పడి గాయాలపాలైనట్లు కాలనీ వాసులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గద్వాల పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతు చర్యలు చేపడుతామని చెప్పారు.

–న్యూస్‌టుడే, గద్వాల అర్బన్



ఎట్టకేలకు మరమ్మతులు

మానవపాడు జడ్పీ ఉన్నత పాఠశాల భవనం మరమ్మతులు బుధవారం ప్రారంభమయ్యాయి. భవనం మరమ్మతులకు గురైన విషయంపై గతంలో 'ఈనాడు' దినపత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులు రూ.60 వేలతో పాఠశాల భవనంపై పెచ్చులూడిన సిమెంట్ దిమ్మెలను తొలగించి మరమ్మతులు చేయిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఈ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వివరించారు.

–న్యూస్‌టుడే, మానవపాడు

వైభవంగా బతుకమ్మ సంబురాలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బతుకమ్మ పండుగ సంబురాలను వైభవంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం తేరుమైదానంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆటపాటల అనంతరం బతుకమ్మను లింగంబావిలో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్, జడ్పీ సీఈవో కాంతమ్మ, ఏవో వీరభద్రప్ప, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

భాజపాకు పెరుగుతున్న ఆదరణ



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శేఖర్

అయిజ, రాజోలి, ధరూరు, న్యూస్‌టుడే: దేశ ప్రజలు భాజపా వైపే ఉన్నారని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం అయిజ మండలంలోని బైనపల్లి, కొత్తపల్లి, సింధనూరు గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును చరవాణిలో ఎలా నమోదు చేసుకోవాలనేదానిపై వివరించారు. ఆంజనేయులు, మల్లేశ్, వినోద్, గోపాల్, రమేశ్ పాల్గొన్నారు. ● భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పచ్చర్ల, మాన్‌దొడ్డి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కోట్ల వీరేశ్‌రెడ్డి, దస్తగిరి, రామాంజనేయులు, అశోక్‌రెడ్డి, భీమన్న, తిరుపతి, గోవర్ధన్, రమేశ్‌బాబు తదితరులున్నారు. ● కేటిదొడ్డి మండలం పరిధిలోని పాగుంట గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా పార్టీ నేత శివారెడ్డి పాల్గొన్నారు. హన్మిరెడ్డి, కిష్టన్న, శ్రీపాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'

మల్దకల్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించి మంచి భవిష్యత్తును సాధించుకోవాలని ఆవోపా జిల్లా అధ్యక్షుడు మరిడి శ్రీకాంత్ సూచించారు. మల్దకల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆవోపా మండల అధ్యక్షుడిగా నరహరి వేంకటేశ్వర్లు, కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా నర్సింహయ్య ఎన్నికయ్యారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఇల్లూరి నాగరాజు, పట్టణ అధ్యక్షుడిగా బాదం శ్రీనివాసులు, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడిగా మనసాని నాగరాజు తదితరులు ఎంపికయ్యారు.

బాపూ బాట యువతకు అనుసరణీయం

అయిజ, న్యూస్‌టుడే: నేటి యువత బాపూబాటలో నడవాలని ఉమ్మడి జిల్లా విశ్రాంత డీఈవో శివార్చక విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2 నుంచి ఆయన చేపట్టిన బాపూ బాటలో సత్యశోధన 100 రోజుల పాదయాత్రలో భాగంగా బుధవారం ఆయన అయిజకు చేరుకున్నారు. అఖిలపక్ష కమిటీ నాయకులు స్వాగతం పలికారు. కొత్తబస్టాండు కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి యువత పాశ్చాత్య పోకడలకు అలవాటు పడి తప్పుదోవ పడుతున్నారని తెలియజేశారు. రవీంద్ర ధీర, ఈశ్వర్, ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్, వినోద్, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పచ్చర్లలో వైద్య శిబిరం విజయవంతం

రాజోలి, న్యూస్‌టుడే: పచ్చర్ల ఎంబీ చర్చి వద్ద నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్‌కు చెందిన హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 400 మందికి పైగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. పాస్టర్ రత్నం, వైద్య బృందం పాల్గొన్నారు.



పచ్చర్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం